క్లుప్తంగా

హోం మంత్రి వనితను కలిసిన పీవీ బ్రదర్స్



మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీవీ బ్రదర్స్

ద్వారకాతిరుమల: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితను ద్వారకాతిరుమలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పులవర్తి కిరణ్, హేమంత్ (పీవీ బ్రదర్స్)లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులు కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసంలో కలుసుకుని పూల బొకెను అందించారు. అనంతరం ద్వారకాతిరుమల గ్రామ సమస్యలను ఆమెకు వివరించి పరిష్కరించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పరింపూడిలో గ్రామానికి చెందిన కొల్లూరి కిరణ్‌కుమార్ ఇంట్లో 14 బస్తాల బియ్యాన్ని ఈనెల 12వ తేదీ రాత్రి గుర్తించినట్లు చెప్పారు. బియ్యం విలువ సుమారు రూ.28 వేల వరకు ఉంటుందని తెలిపారు. కిరణ్‌కుమార్‌పై 6(ఎ) కేసు నమోదు చేసినట్లు చెప్పారు. డీటీ వెంట వీఆర్‌వో అడపా రామ్మోహన్, వీఆర్‌ఏ జ్యోతి ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కుక్కునూరులో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ అచ్యుతాకుమారి

కుక్కునూరు: మండలంలోని పోలింగ్ బూత్‌లను నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అచ్యుతాకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఎదురయ్యే సమస్యలను వీఆర్‌వోను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఏఏ సౌకర్యాలు బూత్‌ల వద్ద కల్పించాలన్న దానిపై పరిశీలించారు. తహసీల్దార్ వెంట హెడ్ కానిస్టేబుల్ సుకుమార్, వీఆర్‌వోలు ఉన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత సుబ్రహ్మణ్యంకు బాండ్‌ను అందజేస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు మంగళవారం రూ.1,01,116లను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన పి.సుబ్రహ్మణ్యం ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

దెందులూరు: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సంతాన లక్ష్మిగా పేరొందిన గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ పూర్తి చేసింది. అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవాలు ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది. ముఖ ద్వారం, ఎగ్జిబిషన్, భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణ, భక్తులు నేరుగా ఆలయానికి వెళ్లడానికి తారు రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యసేవలు, పోలీస్ బందోబస్తుతో తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. 16న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉత్సవాలను ప్రారంభిస్తారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ముఖ్య అతిథులుగా హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలను ఆదుకున్న 'ఆసరా'

వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి కె.సునీల్ కుమార్ యాదవ్



చింతలపూడిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ సునీల్ కుమార్, చింతలపూడి కన్వీనర్ విజయరాజు



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ సునీల్ కుమార్ యాదవ్

చింతలపూడి: రాష్ట్రంలో కోట్లాది మంది మహిళలను వైఎస్సార్ ఆసరా పథకం ఆదుకుందని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక వీకేఎం కళ్యాణ మండపంలో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నేతృత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సునీల్ కుమార్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.విజయరాజు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో బకాయిపడ్డ రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. నియోజకవర్గంలో 4వ విడతగా 5,962 మహిళా గ్రూపులకు రూ.66.4 కోట్లు మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాఫీ చేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గాలను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్‌కు కానుకగా అందించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు మాట్లాడుతూ ఆసరాతో పాటు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నియోజకవర్గంలోని మహిళలను ఆదుకుంటున్నారని అన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా మహిళలకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్న మనసున్న మహరాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని చెప్పారు. ప్రతి మహిళా ఒక శక్తిలా మారి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాలకు ఆసరా చెక్కును అందజేశారు. మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, రాష్ట్ర యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి కె.దినేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి భరత్‌రెడ్డి, నాయకుడు గంధం చంటి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుత్తా కిషోర్, మండల పరిషత్ చీఫ్ విప్ కె.రామారావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎం.దిలీప్, ఏపీఎం జ్యోతి, మహిళా సంఘం నాయకురాలు పార్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు కుక్కునూరులో 'ఆసరా' కార్యక్రమం

కుక్కునూరు: కుక్కునూరులో బుధవారం జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పోలవరం శాసన సభ్యుడు తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ హాజరవుతారని పార్టీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు, వైఎస్సార్ సీపీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నారు. జంగారెడ్డిగూడెం మండల స్థాయి జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్నది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు కామవరపుకోటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల స్థాయి ఆసరా కార్యక్రమం నిర్వహించనుండగా, ఈ కార్యక్రమానికి కంభం విజయరాజు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ హాజరై డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తారు.

నేడు జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో బుధవారం ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమాన్ని 7వ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రైతుల సమస్యలపై కొయ్యలగూడెం జెడ్పీటీసీ గళం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం: మండలంలోని రైతుల భూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కొయ్యలగూడెం జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్‌ను కోరారు. మంగళవారం ఏలూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఈ మేరకు కోరినట్లు ఆమె తెలిపారు. ఇటీవల నిర్వహించిన జగనన్న భూ సర్వేలో రైతుల భూములకు సంబంధించి రికార్డుల్లో హెచ్చుతగ్గులు నమోదు అయ్యాయని, దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విఘాతం కలుగుతోందన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది వల్లే ఈ విధమైన పొరపాట్లు మండల వ్యాప్తంగా ఉన్నాయని, వాటిని సవరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపినట్లు ఆమె చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రికార్డులను పరిశీలించి తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అనువుగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కోరినట్లు ఆమె చెప్పారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

- వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్
- లింగపాలెంలో 'ఆసరా' చెక్కుల పంపిణీ



మహిళలకు చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, పక్కన చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమైందని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. మంగళవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం నిర్వహించారు. సభలో సునీల్ కుమార్ యాదవ్, విజయరాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ, ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రపంచం గర్వించేలా జగనన్న ప్రజల చెంతకే పాలన తెచ్చారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల గుండెల్లో ఉందన్నారు. నవరత్నాలు అమలు చేసి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న జగనన్నకు ప్రజలంతా అండగా నిలబడాలని కోరారు. ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అని అన్నారు. సీఎంగా మళ్లీ జగన్నను గెలిపిస్తే ప్రజల కష్టాలను తీర్చి జీవితాలను మరింత మెరుగుపర్చుతామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలనే లక్ష్యంతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సునీల్ కుమార్ యాదవ్, విజయరాజు చేతుల మీదగా లింగపాలెం మండలానికి చెందిన రూ.13,77,94,365ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి ఝాన్సీ, లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొఠారి మోహన్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ అన్నపనేని శాంతరావు, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, నాయకులు ఇనుగంటి సతీష్, రావి కొండయ్య, కోటగిరి హరీష్, బి.ప్రభాకరెడ్డి, ఓ.ప్రభాకరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలోని శ్రీ నాగ బంధన, శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఆళ్ల దుర్గారావు, శేషారత్నం దంపతుల సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయంలో మాఘమాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని స్థానిక గ్రామ పెద్దలు ప్రారంభించారు. మంగపతిదేవి పాలెం, పోతిరెడ్డి పాలెం గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం మహిళా భక్తులు పారాయణం చేశారు.

స్వీటీ సెలెనాకు సాహిత్యరత్న అవార్డు



అవార్డును అందుకుంటున్న స్వీటీ సెలెనా

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన కొప్పర్తి స్వీటీ సెలెనా సాహిత్యరత్న జాతీయ అవార్డును అందుకుంది. ఇటీవల తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ 7వ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 600 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె అకాడమీ ప్రెసిడెంట్ నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకుంది. స్వీటీ సెలెనా 'కులం, కులం', 'సమాజంలో సమానత్వం', 'డాక్టర్ బాబా సాహెబ్ ఆలోచనలు' వంటి కవితలకు గత ఏడాది డిసెంబర్‌లో అకాడమీ నుంచి సాహిత్యరత్న జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 11వ తేదీన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేసినట్లు ఆమె తెలిపింది. స్వీటీ సెలెనా ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు శ్రీ వైష్ణవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ కేవీఎస్ ప్రసాద్

జంగారెడ్డిగూడెం: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యాన మంగళవారం జంగారెడ్డిగూడెం నవ భారత్ పామాయిల్ పరిశ్రమ నందు ట్రాక్టర్, లారీ డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రాణం విలువైనదని, అతివేగం, అవగాహన లోపం, నిర్లక్ష్యం వలన ప్రాణాలు కోల్పోవడంతో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వాహనాలపై అధిక లోడు వేయడం వలన వాహనం అదుపు తప్పి ప్రమాదాలు జరగడంతో పాటు వాహన ఇంజిన్, రోడ్డులు త్వరగా పాడవుతాయని తెలిపారు. కార్యక్రమములో అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ వీఎల్ ప్రవీణ, నవ భారత్ పామాయిల్ పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు కొమడవోలు ప్రాంతానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆటో యూనియన్ అతన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు చెబుతున్నారు. ఏలూరు కొమడవోలు ప్రాంతానికి చెందిన చలపరెడ్డి మురళి (45) గతంలో ఆశ్రం కళాశాల జంక్షన్‌లో ఒక హోటల్ నిర్వహించేవాడు. ఆశ్రం జంక్షన్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో షాపులన్ని తొలగించారు. అనంతరం మురళి ఆటోను కొనుగోలు చేసి అదే సెంటరులో ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను మద్యం తాగి ఆటోను నడపడంతో యూనియన్ కమిటీ 15 రోజుల పాటు ఆటో నడపవద్దని, మద్యం తాగితే ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం ఉందని సూచించారు. ఆటో నడపటం మానివేసి హోటల్ పెట్టే ప్రయత్నం చేశాడు. ఆశ్రం సెంటర్‌లోని పాత హోటల్ స్థలంలో హోటల్ పెట్టేందుకు ప్రయత్నించగా అదే స్థలంలో ఆటో యూనియన్ స్టాండ్ అని బోర్డు పెట్టడంతో మనస్థాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం అక్కడే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. పక్కనే ఉన్న ఏలూరు కాలువలో దూకేశాడు. తీవ్ర గాయాలపాలైన మురళిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నినాదాలు చేస్తున్న హమాలీలు

బుట్టాయగూడెం: ఈనెల 16వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ కోరారు. మండలంలోని కేఆర్ పురంలో గిరిజన కార్పొరేషన్ సివిల్ సప్లై హమాలీల జనరల్ బాడీ సమావేశం కోర్సా కిశోర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతు కార్మిక సంఘాలు, గ్రామీణ రైతు బంధు, పారిశ్రామిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. అనంతరం హమాలీ కార్మికులు కొద్దిసేపు జీసీసీ గోడౌన్ వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మికులు మీసాల ఏసు, డి.రాజు, కె.రాజేష్, కె.రవివర్మ, కె.చందు, పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్రంపాడులో జూదరుల అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో పేకాట శిబిరంపై ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ అధికారులు దాడి చేశారు. మంగళవారం సాయంత్రం సత్రంపాడు సీతారామ్‌పూర్ అపార్ట్‌మెంట్‌లో పేకాట శిబిరంపై దాడి చేసిన ఎస్‌ఈబీ సీఐ సునీల్ కుమార్, సిబ్బంది పేకాటాడుతున్న 12 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పేకాట ఆడుతున్న వ్యక్తులను, నగదు, సెల్‌ఫోన్లను ఏలూరు త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావుకు అప్పగించారు. ఈ మేరకు ఆయన కేసు నమోదు చేశారు.

విజ్ఞానం పెంపొందించుకోండి



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కమిషనర్ శారదా దేవి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) /ఏలూరు (మెట్రో) : యువత సోషల్ మీడియాను వీడి విజ్ఞానం పెంపొందించుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్, ఏపీ స్టెప్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదా దేవి పిలుపునిచ్చారు. సెట్‌వెల్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారదా దేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి మొబైల్ ఫోన్, ఇంటర్‌నెట్ వంటి చిన్నచిన్న త్యాగాలను చేయాల్సి ఉంటుందని చెప్పారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్ విజయ కుమార్, జి.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి వేకువజామున లేచి పట్టుదలతో చదవడం ద్వారా జ్ఞానం సంపాదించాలని, ఆ జ్ఞానంతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రణాళికతో కూడిన విద్యాభ్యాసం చేయడం ద్వారా విజయాలు పొందాక్రాంతమౌతాయన్నారు. ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం మాట్లాడుతూ ఇన్‌స్టా గ్రామ్ వంటి సోషల్ మీడియాల వల్ల విద్యార్థుల జీవితాలు తారుమారౌతాయని, వాటి జోలికి పోవద్దని ఉదాహరణలతో హెచ్చరించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కేజే కెనడీ, అకౌంటెంట్ పసుపులేటి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆటల్లో నైపుణ్యం సాధించాలి



బాలుర హాస్టల్‌లో నా ఈ దిశ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీజీఎం (ఏపీ, తెలంగాణ) వి.కుమార్ అన్నారు. స్థానిక శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నా ఈ దిశ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్‌కు సంబంధించిన స్పోర్ట్స్ కిట్‌లను అందజేస్తున్నట్టు చెప్పారు. ఆయా ఆటల్లో నైపుణ్యం సాధించేందుకు శిక్షకులనూ ఏర్పాటు చేశామని, విద్యార్థులు పూర్తి స్థాయిలో నైపుణ్యం సాధించేంత వరకు శిక్షకులు కొనసాగుతారని తెలిపారు. ఐవోసీ మేనేజర్ జేబీఎస్ విద్యాధర్, సెక్షన్ ఆఫీసర్ పి.తిమ్మప్ప, వసతి గృహం చీఫ్ ప్రొబేషన్ సూపరింటెండెంట్ టి.మధుసూదనరావు, డాక్టర్ పి.కిషోర్, డాక్టర్ మోహనరావు, జీవీఎల్ సత్యనారాయణ, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్బంధ చర్యలు దారుణం

ఏలూరు (టూటౌన్): రైతుల ఛలో ఢిల్లీ కార్యక్రమంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రైతుల రుణమాఫీ చేయాలని, రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఢిల్లీ ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

'ఉద్యోగుల సమస్యలపై సీఎంతో చర్చిస్తాం'

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తామని ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, జేఏసీ కన్వీనర్ ఎస్ రామారావు, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఏలూరు టౌన్: ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ హెచ్చరించారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని తంగెళ్లమూడి, కబాడిగూడెం, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో సీఐ ప్రభాకర్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడే వారి పట్ల ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలను ప్రజలకు వివరించారు. బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు, యువతుల పట్ల ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాత్రిపూట గస్తీతో పాటు పగటివేళల్లో సైతం పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో ఒక వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కె.రాజారెడ్డికి అందిన సమాచారం మేరకు ఘటనా స్థలిలో మద్యం విక్రయిస్తున్న బారు రాజా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.